అబలలకు నిజమైన గౌరవం

# ట్రాంలో

★ సి. హెచ్. ఎస్. నారాయణ ★

ట్రాములో క్రిక్కిరిసి కూర్చున్నాము.

ఇద్దరుయువతులు-విద్యార్థినులులా గున్నారు. వచ్చారు.

ఖాళీలేకపోవడం మూలాన్ని నించున్నారు.

నా ప్రక్క నున్నాయనరండి కూర్చోండని లేచాడు.

వొకామెవచ్చి కూర్చుంది.

నా ముందుకూర్చున్నాయన నా వైపుయె గాదిగా చూచాడు నన్ను లేచి రెండో ఆమెకు చోటివ్వమన్నట్లుగా.

నేను కదల్లా.

వాడు తెలుగు తెలీదనుకున్నాడు కాబోలు "మిలిటరీ గొడ్లకి మంచీ మర్యాద తెలీదు" అని ప్రక్కనున్నాయనతో అంటూ లేచిరెండో అమ్మాయికి చోటిచ్చాడు.

"ఏమిటి సెలవిచ్చారు..." అన్నా. తెల్ల పోయాడు మనిషి.

"మేము మంచీ మర్యాద తెలీని గొడ్లమని మీ కెట్లా తెలుసు?"

"మరి స్త్రీలువచ్చి నించుంటే లేచి చోటివ్వ కుండా కూర్చున్నావే?" అన్నాడు రోషంగా

"స్త్రీలువస్తే నాకేం?" అన్నా తేల్గ్గా.

"స్త్రీలువస్తే నాకేమా! స్త్రీలు సుకుమారులు అబలలు. వాళ్ళని మర్యాదచెయ్యడం మగవాళ్ళ మైన మనవిధి"అని షివల్రీ వరవళ్ళు పెట్టినట్లు మాటాడాడు.

"ఎవ్వరు చేశారు వాళ్లని అబలలుగాను సుకుమారులుగానూ" అన్నా.

"అందుకే మీకు మర్యాద తెలీదన్నాను" అన్నాడు.

"ఏమిటామాట?" అన్నా.

"ఏం?" అన్నాడు.

"స్త్రీని సుకుమారివనీ, సౌందర్య నిలయానివనీ అదనీ యిదనీ వుబ్బి తబ్బిబ్బుచేసి ఆమెమీద మగాడు అధికారం చెలాయించడానికి వేసిన యెత్తులు తప్పితే స్త్రీ యేవిధంగానూ యెందు లోనూ పురుషుడితో తీసిపోదు. ఈ ఇద్దరు అమ్మాయిలకి—యౌవనపటుత్వంలో వున్న వాళ్ళకి—నించోడానికి శక్తిలేదూ? స్త్రీలనే నిజంగా బాగుచెయ్యాలనే వుద్దేశ్యమే వుంటే వాళ్లకి మీరు మీతో సమానస్థానాన్నివ్వాలి అన్ని విషయాలలో. ఇప్పుడీ అమ్మాయిలకిబదులు ఏదో యిద్దరు ముసలమ్మలుకాని తాతలుగానివచ్చి వుంటే మీరిలా మాటాడివుండరు. స్త్రీని మనం చాలాత అధోగతిలోవుంచాము. ఇతరదేశాల్లో స్త్రీలు వాళ్ల పనులన్నీ వాళ్లే చేసుకుంటారు మగాడి అవసరం లేకుండానే! రష్యాలో ఆడాళ్ళు మగాళ్లతో పరుగుపందెలలో పాల్గొని గెల్చిన విషయాలు వింటున్నాము. ఈ దేశంలో అయ్యితే ఆడది పరుగుత్తూందంటే, "ఆ యెంత హద్దుమీరిపోయిందీ" అనంటారు. జవసత్వాలల్లోవున్న స్త్రీకి ట్రాములో కూచోడానికి చోటివ్వనంతమాత్రాన మిలిటరీ గొడ్డుసై పోయానన్నమాట మీ దృష్టిలో" అని దంచు తూంటే ఇంతలోవొక ముసలాయన ముసలమ్మ యెక్కారు.వచ్చి నిలబడ్డారు.

"కూర్చోండి. మామ్మగారూ!" అంటూ లేచి చోటిచ్చా. ముసలమ్మ కూర్చుంది.

మిగతావాళ్ళెవళ్ళూ కదల్లా.

"ముసలాయనవచ్చి నుంచుంటే మీరన్నా కాస్తలేచి చోటివ్వకూడదండీ?" అన్నా ప్రక్క నున్నా పడుచమ్మాయితో.

యేమనుకుందో పాపం సిగ్గుపడిలేచింది.

తాత కూర్చున్నాడు.

నేను దిగాల్సినచోటు వచ్చింది. దిగుతున్నా.

ఇందాకాయనవచ్చి "మిమ్మల్ని తెలుసుకో కుండా అసభ్యంగా ప్రవర్తించాను. నన్ను క్షమించాలి మీరు" అన్నాడు.